ప్రజా సంక్షేమమే జగన్ ధ్యేయం

పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము


పెడనలో ప్రజలతో మాట్లాడుతున్న ఉప్పాల రాము ఇతర నేతలు

పెడన: ప్రజా సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉప్పాల రాము అన్నారు. పెడన పట్టణంలోని కలంకారి వ్యాపారవేత్తలను, పట్టణ ప్రముఖులను, తటస్థ నాయకులను, ఆర్యవైశ్య ప్రముఖులను శనివారం కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన గత ప్రభుత్వం కంటే మెరుగ్గా ఉందనే విషయం మీకు తెలిసిందేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మల్లి, కౌన్సిలర్లు గంగయ్య, గోపీప్రసాద్, సతీష్, పార్టీ నాయకులు మహంకాళరావు, కోడూరు శ్రీను, దివాకర్ తదితరులున్నారు.

నేడు మండలంలో ఉప్పాల రాము పర్యటన

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆదివారం మండల పరిధిలోని చినగొల్లపాలెం గ్రామంలో పర్యటిస్తారని ఆయన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాదీవెన కార్యక్రమంలో ప్రతి గృహాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


పెదప్రోలులో మూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): కప్తానుపాలెంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలువిరిగిన లచ్చి బుజ్జిబాబును అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెదప్రోలులో కృత్తివెంటి సత్యనారాయణ మూర్తి సతీమణి పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి మూర్తి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పుప్పాల సతీష్‌బాబు, నందిగం అభిషేకరావు, కేసగాని రాంబాబు, కందుల నాగభూషణం, గౌరం శ్రీనివాసరావు, కత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తహసీల్దార్ లతీఫ్‌పాషాకు సన్మానం


తహసీల్దార్ లతీఫ్‌పాషా దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కోడూరు: కోడూరులో ఐదేళ్లు తహసీల్దార్‌గా సేవలందించి బదిలీపై తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లిన షేక్ లతీఫ్‌పాషాను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద లతీఫ్‌పాషా సన్మాన సభను నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడుతూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. రెవెన్యూ సిబ్బంది లతీఫ్‌పాషాకు జ్ఞాపిక అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, ఎస్సీసెల్, బీసీ సంఘాల కన్వీనర్లు వెన్నా ప్రసాద్, లంకే రవి, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓలు రామదాసు, శ్రీనివాసరావు, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాగాయలంక విద్యార్థినులకు ప్రత్యేక బహుమతులు



నాగాయలంక: విప్రో ఎర్తియన్ ప్రాజెక్టు పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైన నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు శనివారం విజయవాడలో రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని మత్తి వెంకట లిప్సిక, తరకటూరి లాస్య సాయి, బండ్రెడ్డి చాందిని, తుంగల సాయి అవంతిక, కర్రి రేవతి, తోపుల యశస్వి, కైతేపల్లి ఉమామహేశ్వరి, సంస్థ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, కాకర్ల వెంకటరత్నం నుంచి బహుమతులు స్వీకరించినట్లు హెచ్‌ఎం కె.శాంతకుమారి చెప్పారు. బాలికలు రూపొందించిన ది మోర్ వెరైటీ, ది బెటర్ సొసైటీ అనే ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. గైడ్ టీచర్ ఉదయకుమార్, బహుమతులు పొందిన విద్యార్థినులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

87 మంది ఉద్యోగుల రక్తదానం



మచిలీపట్నంటౌన్: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.వాణిశ్రీ ఆధ్వర్యాన శనివారం నగరంలోని ఆర్టీసీ డిస్పెన్సరీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లాలోని ఐదు డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు 87 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాలను జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల సూచనతో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది శిబిరంలో పాల్గొన్నారన్నారు. డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారన్నారు. రక్తదానం చేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిస్పెన్సరీ వైద్యుడు ఎంఎస్ విజయసింగ్, డిపో మేనేజర్ కె.హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ పీడీడీ జేమ్స్, అసిస్టెంట్ ఇంజినీర్ మెకానికల్ డి.రాజేష్, డెప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేగ నియంత్రణ తప్పనిసరి




కృత్తివెన్ను: రోడ్డు ప్రయాణంలో డ్రైవర్లు తప్పనిసరిగా వేగాన్ని నియంత్రించుకోవాలని, దీంతో పాటు రోడ్డు భద్రతా ప్రమాణాలకు తగ్గట్టు వాహనాలను నడపాలని కృత్తివెన్ను ఎస్ఐ నాగరాజు అన్నారు. ఆయన కృత్తివెన్నులో శనివారం సాయంత్రం ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. వాహనపత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. జాతీయ రహదారి కావడంతో జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. మద్యం తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 60 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గజిటెడ్, నాన్‌గజిటెడ్ ఆఫీసర్స్ సంఘ సమావేశం

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ కార్యవర్గం డిమాండ్ చేసింది. ఆ సంఘ సమావేశం శనివారం నగరంలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ హాల్లో జరిగింది. సంఘ జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11వ తేదీ ఆదివారం జరిగే రాష్ట్ర జేఏసీ సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి ఎ. వెంకటేశ్వరరావు, కేపీ రావు, ఆర్.హేమప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు రాత పరీక్ష



గూడూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 16వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కేడెట్లకు రాత పరీక్ష నిర్వహించారు. పాఠశాల నుంచి ఎన్‌సీసీలో 52 మంది విద్యార్థులు ఉన్నారు. కల్నల్ సన్సార్ సింగ్ ఆధ్వర్యాన సీహెచ్‌ఎం జి.శంకరరావు పర్యవేక్షణలో ఓఎంఆర్ షీట్లలో ఎన్‌సీసీ జనరల్, నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ అవేర్నెస్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్, సోషల్ సర్వీస్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, హెల్త్ అండ్ హైజిన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మ్యాప్ రీడింగ్,బాటిల్ క్రాఫ్ట్ మిలటరీ హిస్టరీ కమ్యూనికేషన్ తదితర అంశాలపై పరీక్ష జరిగింది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎన్‌సీసీ ఎ సర్టిఫికెట్ లభిస్తుందని పాఠశాల హెచ్‌ఎం డి.పుష్పలత తెలిపారు.

శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు

ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి


అవనిగడ్డలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

అవనిగడ్డ: అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ని శనివారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిస్థితులను డీఎస్పీ మురళీధర్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివాదాలు నెలకొన్న ప్రాంతాలను గుర్తించి శాంతి భద్రతలకు అందరూ సహకరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐ త్రినాథ్, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్ పరిశీలించిన ఎస్పీ

మోపిదేవి: మోపిదేవిలో కొత్తగా రూ. 1.40 కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సందర్శించారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కోడ్ రాకముందే త్వరలోనే పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తామని ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు పోలీస్ అవుట్ పోస్టులో విధులు కొనసాగుతున్నాయని, నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. అంతకు ముందు అవుట్‌పోస్టులో రికార్డులు పరిశీలించారు.

నేడు అన్నమాచార్య సంకీర్తనోత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని శ్రీ చిట్టిపిళ్లారయ్య స్వామి దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం పద కవిత పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ అన్నమాచార్య సంగీత సభ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ, గాయకులు పాల్గొని అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమం సాయంత్రం 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.

19న భావనారుషిస్వామి కల్యాణం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలోని భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 19వ తేదీ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అందే జగదీష్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు వార్షిక మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

పెదపారుపూడి: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తమ్మలంపాడు గ్రామానికి చెందిన 27 మంది పేదలకు ఎంపీపీ శనివారం జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తమ్మలంపాటు గ్రామంలో 25 మంది లబ్ధిదారులకు, దూళ్లవానిగూడెంలో రెండు ఇళ్ల పట్టాలు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోళ్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: కానూరులో మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన లంకపల్లి దేవి తన ఇంటి సమీపంలో ఖాళీ స్థలంలో శుక్రవారం గేదెలు మేపుతుండగా అదే గ్రామానికి చెందిన కాటూరి వెంకటరమణ, ఆమె కుమారుడు బ్రహ్మాజీ, మరో వ్యక్తి వచ్చి ఇక్కడ గేదెలను గడ్డి ఎందుకు మేపుతున్నావని గొడవ పడ్డారు. ముగ్గురు వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి విషయంలో ఘర్షణ.. పరస్పర ఫిర్యాదులు

పెనమలూరు: చోడవరం గ్రామంలో ఇంటి విషయమై కుటుంబంలో వివాదం జరిగి పరస్పర దాడులు చేసుకోవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఐనంపూడి అమ్మాజీ గత ఐదేళ్లుగా తండ్రి చోడవరపు బుల్లెయ్యకు చెందిన ఇల్లు మరమ్మతులు చేసుకుని అందులో ఉంటోంది. అయితే ఆమె సోదరుడు మరియన్న, సోదరి మరిమమ్మ, ఆమె భర్త ప్రేమ్‌కుమార్ ఇంట్లో ఉండరాదని గొడవ పడి దాడి చేశారు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మరియమ్మ ఫిర్యాదు చేస్తూ తన సోదరి అమ్మాజీ తనను ఇంటి విషయమై దాడి చేసిందని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

చిన్నారుల తల్లిదండ్రులకు పరామర్శ


అస్వస్థతకు గురైన వర్షిత కృష్ణను పరామర్శిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో అస్వస్థతకు గురై వైద్యసేవలు పొందుతున్న చిన్నారుల తల్లిదండ్రులను బందరు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ శనివారం పరామర్శించారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం కుదుటపడిందని ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యసిబ్బంది తెలిపారు. ఆరోగ్యం కుదుటపడటంతో చిన్నారులు ఆడుకుంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే పిల్లలకు చలి, జ్వరం వచ్చిందని వెంటనే వైద్యం అందించారని దీంతో తమ పిల్లల ఆరోగ్యం కుదుటపడిందని తల్లిదండ్రులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. వైద్యులు అందించిన సేవలను ఆమె అభినందించారు. చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించిన వారిలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జమాత్ ఇస్లామీ ప్రతినిధులు

పెనమలూరు: మత్తు పదార్థాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నిర్వహించాలని జమాత్ ఇస్లామీ నార్త్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ సూచించారు. కానూరు సనత్‌నగర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 296 మిలియన్ల ప్రజలు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారని తెలిపారు. వీరిలో 35 బిలియన్ల మంది రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. భారతదేశంలో 14.6 కోట్ల మంది ఆల్కహాల్ దురలవాటుకు లోనై అయ్యారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో హెచ్ఐవీ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. విజయవాడ నగర అధ్యక్షుడు ఖలీలుల్లాహ్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవిష్యత్ అంధకారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సంస్థ ద్వారా ప్రజలు, యువతలో చైతన్యం తీసుకువచ్చి మత్తు పదార్థాల నివారణకు విస్తృత ప్రచారం చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సిద్ధిక్, సంస్థ సభ్యులు లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేత


ఆర్వో ప్లాంట్ అందజేస్తున్న దాతలు

పెనమలూరు: కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను దాత బహుకరించారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విజయవాడకు చెందిన వీర్‌బ్యాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ రాజు రూ.50 వేలు విలువ చేసే 50 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. దాతను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పెద్దు విజయలక్ష్మి, పాఠశాల కన్వీనర్ అన్నే శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన


అవగాహన కలిగిస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు తెలిపారు. ఎస్.ఎ పేటలో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీహరిబాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా చూస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించి ఆన్‌లైన్ మోసాలకు అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ఆన్‌లైన్ లావాదేవీలు, ఆన్‌లైన్‌లో కరెంటు బిల్లులు, నగదు పంపించడం వంటి లావాదేవీలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకులో, సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఘనంగా మాఘమాస నవరాత్రులు

కై కలూరు: స్థానిక శ్యామలాంబ దేవాలయంలో మాఘమాస నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మొదటిరోజు లఘు శ్యామలాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సమ్మెట సాంబశివరావు దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వాగ్వాదిని శ్యామలగా అమ్మవారు ఆదివారం దర్శనమిస్తారని ఆలయ ఈఓ వీఎస్‌కే.శేఖర్ తెలిపారు. ఆలయ చైర్మన్ గుర్రం రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనసేన నేతలపై కేసు

కోనేరుసెంటర్: నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేలా నగరం నడిబొడ్డున పార్టీ జెండా దిమ్మెను నిర్మించిన జనసేన నాయకులపై మచిలీపట్నం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. నగరంలో భాస్కరపురంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి సమీపంలో ఈ నెల రెండో తేదీన జనసేన నాయకులు పార్టీ దిమ్మెను నిర్మించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు దిమ్మెను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. జనసేన నాయకులు వాటిని బేఖాతరు చేయడంతో నాలుగో తేదీన నగరపాలక సంస్థ సిబ్బంది సదరు పార్టీ దిమ్మెను అక్కడి నుంచి తొలగించారు. దీంతో జనసేన నాయకులు పదో తేదీన మళ్లీ అదే ప్రాంతంలో కొత్త దిమ్మెను ఏర్పాటుచేశారు. అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి దర్గా మల్లికార్జున సిబ్బందితో అక్కడికి వెళ్లి నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా పబ్లిక్‌లో పార్టీ దిమ్మెను నిర్మించడానికి వీల్లేదని చెప్పారు. ఆగ్రహించిన జనసేన నాయకులు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి నెట్టి వేశారు. దీంతో అధికారి మల్లికార్జున ఘటనపై జేనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, ఇతర నాయకులు కొట్టే వెంకట్రావు, మాదివాడ రాము, వాలిశెట్టి మల్లి, కర్రి మహేష్, గల్లా తిమోతి మరి కొంతమంది నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మచిలీపట్నం పోలీసులు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు ఇస్తున్న ట్రస్ట్ సభ్యులు

మోపిదేవి: మోపిదేవి లే అవుట్-3లోని యానాదులకు చల్లపల్లికి చెందిన లలితాదేవి చారిటబుల్ ట్రస్టీ ముమ్మారెడ్డి వెంకట కృష్ణారావు ఆధ్వర్యాన శనివారం సాయంత్రం దుప్పట్లు పంపిణీ చేశారు. వెంకట కృష్ణారావు మనవరాళ్లు శిర్విత, హంసూజ పుట్టిన రోజు సందర్భంగా 30 మందికి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో కేతరాజు వల్లీ, గుడివాక శేషుబాబు, పూషడపు రత్నగోపాల్, బోగిరెడ్డి సాంబశివరావు, యర్రంశెట్టి సునీల్, పర్చూరి కేశవ, కోసూరు అన్వేష్‌బాబు పాల్గొన్నారు.

చిలకలపూడి(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని చిలకలపూడిలో శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని పెంతెకోస్తు చర్చిలో శనివారం జరిగిన కార్యక్రమంలో 40 మంది విశ్వాసులకు శ్యాంకిశోర్‌నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఏసయ్య, తోట శ్యాంకృష్ణ, పాస్టర్ ప్రేమ్‌చంద్, కెఎస్ పాల్, అభిషేక్ సందీప్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల స్టాల్స్ పరిశీలన


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: గ్రామంలో వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల సభ్యులు పలు రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో డ్వాక్రా సంఘాలు తయారు చేసే పచ్చళ్ల, పిండి వంటలు తదితరాలను ప్రదర్శించారు. ఈ స్టాల్స్‌ను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ సందర్శించి అక్కడ ప్రదర్శించిన వాటిని పరిశీలించి ఆయా గ్రూపు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు డి.కృపావతి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఐకేపీ సీసీలు ఏసీ సుందరరావు, ఏపీఎం తిరుపతయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మాణమైన వాటర్ ట్యాంకులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామంలోని 24కె కల్యాణ మండపం వద్ద 1.20 లక్షల లీటర్లు, బీసీ శ్మశానవాటిక వద్ద 60 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. వీటికి పైప్‌లైన్ పనులు కూడా పూర్తయ్యాయని, అతి త్వరలో ఈ ట్యాంకులను ప్రారంభించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. అలాగే విజ్ఞాన విహార్ పాఠశాల సమీపంలో 2.40 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి, గ్రామంలో 3 కిలోమీటర్ల విస్తీర్ణంలో వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. గ్రామంలో ప్రస్తుతం మొత్తం 22 మోటారు బోర్లు, వాటర్ ట్యాంక్ సహాయంతో తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

కంకిపాడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాడు - నేడు పథకం ద్వారా వసతులు మెరుగుపర్చారన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్యసహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు గానూ ప్రజలకు ఆరోగ్య శ్రీ కార్డులను అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల వివరాలు కంప్యూటరీకరణ


రైతుల సభ్యత్వాలను కంప్యూటరీకరిస్తున్న సిబ్బంది

ముదినేపల్లి రూరల్: స్థానిక కేడీసీసీ బ్యాంకు బ్రాంచి పరిధిలో సొసైటీల్లో సభ్యులైన రైతుల వివరాలకు సంబంధించి కంప్యూటరీకరణ చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా ముదినేపల్లి బ్రాంచి కార్యాలయంలో మండలంలోని పలు సొసైటీల కార్యదర్శులతో మేనేజర్ కుమార్ శనివారం సమావేశాన్ని నిర్వహించి కంప్యూటరీకరణ గురించి సూచనలు చేశారు. తొలుత కార్యదర్శులతో సభ్యులైన రైతుల వివరాలు కంప్యూటరీకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. సూపర్‌వైజర్ మోరు నాగభూషణం కార్యదర్శులకు తగిన సూచనలు చేశారు.